ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




చావురాత రాసివ్వండి

మరణ ధ్రువీకరణ పత్రం కోసం మూడు నెలలుగా ప్రదక్షిణ



వన్నూరప్ప (ఫైల్)



మృతిచెందినట్లు ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చిన రసీదు

శెట్టూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రం కోసం ఓ కుటుంబం మూడు నెలలుగా సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. మండలంలోని కరిడిపల్లి గ్రామానికి చెందిన వన్నూరప్ప గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరిస్తూ కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రి వారు తాత్కాలిక రసీదు అందజేశారు. దాన్ని తీసుకువెళ్లి మున్సిపల్ కార్యాలయంలో మరణ ధ్రువీకరణ పత్రం పొందాలని ప్రభుత్వాస్పత్రి వారు సలహాఇచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి వెళితే వారు తమకు సంబంధం లేదని చింతర్లపల్లి గ్రామ సచివాలయంలో మరణ ధ్రువీకరణ పొందాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయం వారు సచివాలయం మీద, సచివాలయ కార్యాలయం వారు మున్సిపల్ కార్యాలయం మీద చెప్పుకుంటూ మూడు నెలలుగా బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. కానీ నేటికీ ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అందకుండా పోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రబీ సాగుకు సన్నద్ధం

ఉత్సాహంగా పొలం పనులు

టీబీ డ్యాంలో నీటి నిల్వపై రైతుల హర్షం

- వివరాలు 6లో...



సొంతింటి కోసం చోరీలు

ముఠా ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్

నలుగురి అరెస్టు.. ఇద్దరు పరారీ

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో రికవరీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

7

నిర్లక్ష్యంతోనే ప్రమాదం..!

- విధులను బహిష్కరించిన కార్మికులు
- శివకేశవ కుటుంబంలో తీవ్ర విషాదం
- గాయపడ్డవారికి బెంగళూరులో చికిత్స
- కార్మిక సంఘాల ఆగ్రహం.. చర్యలకు డిమాండ్
- బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే అశ్మిత్



నాన్న లేడని తెలియక.. (అమ్మ ఒడిలో శివకేశవ కుమారుడి నిద్ర)



విధులను బహిష్కరించి.. ఫ్యాక్టరీ బయటే ఉన్న కార్మికులు

యాడికి/తాడిపత్రి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ కార్మికులు గురువారం విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. ప్రమాద స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ప్రమాదంలో మృతిచెందిన శివకేశవ కుటుంబాన్ని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

- తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సీపీఐ, సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం, కార్మికుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించనందుకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఐ నాయకులు రంగయ్య, చిరంజీవి, సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుల మెడపై కత్తిపెట్టి పనిచేయించారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన అదానీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే మెజిస్ట్రేట్‌తో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.



తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బైఠాయించిన సీపీఐ, సీఐటీయూ నాయకులు

సమగ్ర విచారణ

అనంతపురం అర్బన్: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సేఫ్టీ కమిటీ సభ్యులతో సమగ్ర విచారణ జరిపిస్తున్నామని పరిశ్రమ శాఖ జీఎం శ్రీధర్ గురువారం తెలిపారు. ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, అగ్నిమాపక శాఖ అధికారులు, పొల్యూషన్ బోర్డు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌లు ఫ్యాక్టరీని తనిఖీ చేస్తారని తెలిపారు. ప్రమాదం గురించి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరిన్ని వివరాలు 7లో



ఉద్దేహాళ్‌లో పిచ్చి మొక్కలు పెరిగిన జగనన్న లేఔట్

వెళ్లేది ఉండేది ఎలా..?



శ్రీధరఘట్టలో పునాదులకే పరిమితమైన దృశ్యం

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు ఏవీ?

ఇబ్బందిపడుతున్న లబ్ధిదారులు

బొమ్మనహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనావాసాల దూరంగా లేఔట్లు వేసి, పట్టా ఇవ్వడంతో అక్కడికి వెళ్లడానికి చాలా మంది విముఖత చూపుతున్నారు. కనీసం రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కూడా లేకపోవడంతో లేఔట్లు ఇళ్లు నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. మండలంలోని శ్రీధరఘట్ట, నేమకల్లు, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో మండల వ్యాప్తంగా సుమారు 1070 మందికి పట్టాలు ఇచ్చారు. ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తుందని చెప్పడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషపడ్డారు. అయితే ఇళ్ల మీరే నిర్మించుకోవాలని మాట మార్చడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఇళ్ల కట్టుకోకపోతే ఇళ్ల రద్దు చేస్తామని అధికారులు ఒత్తిడి చేయడంతో కొంతమంది అప్పులు చేసి నిర్మించుకున్నారు. అయితే విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సదుపాయాలను సక్రమంగా కల్పించలేదు. దీంతో అక్కడ ఉండటానికి ఇబ్బంది పడుతున్నారు. ఉద్దేహాళ్ గ్రామ శివారులో లేఔట్ వేసి 95 ప్లాట్లు కేటాయించి పట్టాలు ఇచ్చారు. అప్పట్లో ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పాటు చేయవద్దని పలువురు పెద్దలు వారించినా లెక్క చేయకుండా నాటి వైసీపీకి చెందిన కొందరు నాయకులు జగనన్న కాలనీకి స్థలాన్ని ఎంపిక చేశారు. నాయకులకు అనుకూలంగా ఉండేవారికి పట్టాలు ఇచ్చారు. కానీ తాగునీరు, రోడ్లు, విద్యుత్తు తదితర ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో ఒక్కరు కూడా ఇంటి నిర్మాణం మొదలు పెట్టలేదు. పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చేశామని గొప్పలు చెప్పడమే కానీ తమకు చేకూరిన లబ్ధి ఏమి లేదని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం వస్తే చెరువే..

లబ్ధిదారులు సొంతంగా చిన్న ఇల్లు నిర్మించుకుందామన్నానిర్మాణానికి అవసరమైనా సామగ్రి తరలించేందుకు కాలనీలో సరైన రహదారి సదుపాయం లేదు. ఇక లేఔటు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వర్షమొస్తే చెరువును తలపిస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఊరికి దూరంగా ఉండటంతో నివాసయోగ్యంగా లేదని లబ్ధిదారులు అంటున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపు చేసి, భవిష్యత్తు తరాలకు భరోసానివ్వాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలను ప్రారంభించారు. పాతవూరు పవర్ ఆఫీస్ ఆవరణం నుంచి ర్యాలీని నిర్వహించారు. ఎస్ఈ సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత, డీఆర్వో మలోలా హాజరయ్యారు. ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. సూర్యనగర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్.. తిరిగి పవర్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యుత్ వినియోగం బాగా పెరిగిపోయిందని అన్నారు. కరెంటులేకపోతే నిమిషం కూడా ఉండలేని పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్‌ను పొదుపుగా, అనవసరం మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సౌరవిద్యుత్ పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాలయాల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ విశ్వనాథ్ చౌదరి, ఈఈటీ ప్రసాద్, అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, డీఈఈలు రామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

పెన్నాలో ఇసుకాసురులు

వందలాది ట్రాక్టర్లతో జాతరే జాతర



పెన్నానదిలో నీటిలోనే ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెన్నా నదిలో ఇసుకాసురులు పడ్డారు. బెళుగుప్ప మండలం కాలువపల్లి వద్ద అనుమతి లేకుండా యథేచ్ఛగా తోడుతున్నారు. కాలువపల్లి, ఓబుళాపురం, మణిరేవు, హనిమిరెడ్డిపల్లి, ఆత్మకూరుకు చెందిన సుమారు వంద ట్రాక్టర్లు నది నుంచి అనంతపురానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాయి. ట్రాక్టర్ ఇసుక ధర రూ.3 వేలు పలుకుతోంది. దీంతో రాత్రి 7 దాటిందంటే పెన్నానది పరివాహక ప్రాంతమంతా ట్రాక్టర్ల జాతర జరుగుతోంది. నదికి ఇరువైపులా వందలాది ఎకరాలలో తోటలు ఉన్నాయి. ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తవ్వకాలతో 1952లో నిర్మించిన బ్రిడ్జికి ముప్పు ఏర్పడింది. బ్రిడ్జి దిమ్మెల బేస్‌మెంట్ పిల్లర్లు బయటపడేలా తవ్వుకున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే ఇసుకాసురులు బెదిరిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లకు టోల్‌ప్లాజాలో కూడా సహకారం అందుతోంది. నోరు మెదపకుండా ఉండేందుకు ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి ట్రిప్పునకు రూ.200 వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణాపై నిఘా వేశామని ఎస్ఐ శివ అన్నారు. సిబ్బందిని పంపి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆరేళ్లయినా అందని పరిహారం..!

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

హంద్రీనీవా కాలువకు భూములిచ్చిన రైతుల గగ్గోలు

కణేకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువల కోసం భూములు ఇచ్చిన రైతుల ఇటు పరిహారం అందక.. అటు నీరు రాక ఆరేళ్లుగా నిరీక్షిస్తున్నారు. సాగునీరు వస్తే పొలాలన్నీ సస్యశ్యామలమవుతాయని ఆశించి కాలువల ఏర్పాటుకు భూములు ఇచ్చారు. ఆరేళ్లు కావస్తున్నా ఖాతాల్లోకి సొమ్ము జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హంద్రీనీవా నీటిని పొలాలకు మళ్లించేందుకు 36వ ప్యాకేజీలో భాగంగా మాల్యం బ్రాంచ్ కెనాల్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా కళేకుర్తి చెరువుకు నీటిని అందించడంతో పాటు ఈ ప్రాంతంలో మిగతా భూములకు సరఫరా చేయడం ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. టీడీపీ ప్రభుత్వం ఆరేళ్ల క్రితం వేగవంతంగా హంద్రీనీవా కాలువ ఏర్పాటు చేసి దాని అనుసంధానంగా దాదాపు 10 వరకు పిల్ల కాలువలను ఏర్పాటు చేసింది. ఇందు కోసం దాదాపు 42 ఎకరాలను 60 మంది రైతుల నుంచి భూమిని సేకరించింది. ఎకరాకు రూ. 9.75 లక్షలు ధర కూడా నిర్ణయించింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ముగింపు దశలో ఉండగా ఈ కార్యక్రమాలన్నీ సక్రమంగా జరిగాయి.

వైసీపీ అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం

హంద్రీనీవా ద్వారా పొలాలకు నీటితో పాటు భూములకు పరిహారం సొమ్ము కూడా పడుతుందని ఆశించిన రైతన్నలకు వైసీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందు రాయదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన కాలవ శ్రీనివాసులు హంద్రీనీవా నీరు కళేకుర్తి వరకు తెచ్చి సఫలీకృతులయ్యారు. వైసీపీ అధికారంలోకి రాగానే వీటన్నింటిని పట్టించుకోకపోవడంతో కాలువలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురై పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.



మాల్యం వద్ద పొలాల్లో తవ్విన హంద్రీనీవా పిల్ల కాలువ

తప్పని ఎదురుచూపులు

హంద్రీనీవా కాలువ కోసం భూములిచ్చిన మాల్యం, హనకనహాళ్, సొల్లాపురం, కళేకుర్తికి చెందిన దాదాపు 60 మంది రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఒక్కో రైతు నుంచి ఎకరా, రెండెకరాల మేర కాలువల ఏర్పాటుకు తీసుకున్న ప్రభుత్వం సొమ్ము ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడంతో అటు పొలాల్లో పంటలు పండించుకోలేక, విక్రయించిన భూములకు సొమ్ము అందక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా పరిహారపు సొమ్మును అందించాలని రైతన్నలు కోరుతున్నారు.

రూ. 11 లక్షలు రావాలి



మాల్యం వద్ద నాకున్న పొలంలో 1.06 ఎకరాలను పిల్లకాలువల ఏర్పాటుకు తీసుకున్నారు. 36వ ప్యాకేజీలో 22ఎల్ పిల్ల కాలువల కోసం భూమిని ఇచ్చిన నాకు ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 11 లక్షల వరకు సొమ్ము అందాల్సి ఉంది. కానీ నేటి వరకు అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

- శరబనగౌడ్, రైతు, మాల్యం

పరిహారం వెంటనే చెల్లించాలి



కాలువలు ఏర్పాటు ద్వారా మా పొలాలు సస్యశ్యామలమవుతాయనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కోరిన వెంటనే భూములు ఇచ్చాం. మా భూముల్లో కాలువలు తవ్వి సాగుకు పనికి రాకుండా చేశారు. దీంతో అటు డబ్బు అందక, భూములు సాగుకు నోచుకోక ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి.

- విరూపాక్షిగౌడ్, రైతు, మాల్యం


తూట్రాళ్లపల్లిలో..


కూలితే ఎంత ప్రమాదమో..?

కూలేందుకు సిద్ధంగా..

తూట్రాళ్లపల్లిలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

యాడికి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో విద్యుత్‌స్తంభాలు ఒకవైపు ఒరిగిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని రైతులు, అటువైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు నేల కొరిగిన విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించేలా లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాయలచెరువులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


రాయలచెరువులో...


తూట్రాళ్లపల్లి-నగరూరు మధ్య

డీఎంహెచ్‌ఓపై లోకాయుక్తకు ఫిర్యాదు

అనంతపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) భ్రమరాంబికా దేవిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆమె చేసిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఉరవకొండ సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే సిబ్బందికి ఆర్థికపరమైన అంశాలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులిస్తే సంతకాలు చేస్తున్నారని, లేనిపక్షంలో చేయడం లేదని వాపోయారు. ఈ అంశాలతోపాటు అనేక అవినీతి ఆరోపణలకు సంబంధించి లోకాయుక్తకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ఆధారాలను అందజేశానన్నారు. వాటిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు కోదండరామిరెడ్డి తెలిపారు.


ఆగిపోయిన షాదీఖానా నిర్మాణ పనులు

నిర్లక్ష్యానికి నిదర్శనాలు


పిల్లర్ దశలో ఉన్న ఇండోర్ స్టేడియం

ఉరవకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా పట్టణంలోని ముస్లిం షాదీఖానా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇండోర్‌స్టేడియం దర్శనమిస్తున్నాయి. మైనార్టీశాఖ ఆధ్వర్యంలో 2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం పనులు చేపట్టారు. అప్పట్లో రూ.20లక్షల పనులు కూడా పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ పాలనలో అప్పటి మైనార్టీ శాఖమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే 2018లో రూ.2కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రూ.10లక్షల వ్యయంతో శ్లాబ్ స్థాయివరకూ పిల్లర్ నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ నిర్మాణాన్ని ఆపేసింది. అప్పటి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు.

రబీ సాగుకు సన్నద్ధం

ఉత్సాహంగా పొలం పనులు

టీబీ డ్యాంలో నీటి నిల్వపై రైతుల హర్షం



బొమ్మనహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలతో నీరు సమృద్ధిగా లభిస్తుండడంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో వర్షాలు లేక నారుకు ట్యాంకర్ల ద్వారా, బిందెలతో తడిపిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి తుంగభద్ర జలాశయం, చెరువులు నిండడంతో రైతులు రబీలో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షానికి దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆ నష్టాల నుంచి కోలుకునేందుకు రబీకి సిద్ధమవుతున్నారు. వరి సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలో ఖరీఫ్ వరి సాగు తుదిదశకు చేరుకుంటోంది. రైతులు వరి కోతలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రావటంతో ధాన్యం ఆరబోసి కాటాలు వేసి మిల్లులకు తరలిస్తున్నారు. స్థానికంగా నాణ్యమైన విత్తనాలు లేక రైతులు కర్నాటకలోని కంప్లి, గంగావతి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నారు సాగు చేసుకున్నారు. మండల పరిధిలోని లింగదహాళ్, రంగాపురం క్యాంప్, శ్రీధరఘట్ట, గోనేహాళ్, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో వరి సాగు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ కోతలు పూర్తి కాకుండానే తక్కువ కాలంలో వచ్చే నారు చల్లుకున్నారు. ఖరీఫ్‌లో 17 వేల ఎకరాలపైగా వరి పంట సాగు చేశారు. రబీలో 12 వేల ఎకరాల్లో సాగుకు సిద్ధమవుతున్నారు.

రెండోసారి వరి సాగు చేస్తున్నా

నాకు ఉన్న ఆరు ఎకరాల పొలంలో నాలుగు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నాను. ఇప్పటికే వరి నారు పోసుకున్నాను. ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తే ఎకరాకు 45 బస్తాలు దిగుబడి వచ్చింది. ధర లేకపోవడం వల్ల పెద్దగా లాభం లేదు. తుంగభద్ర జలశయంలో నీరు ఉండడం, వ్యవసాయ బోర్ల కింద రెండోసారి పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నాను.



- తిప్పేస్వామి, లింగదహాళ్

రెండో పంటకు సాగునీరివ్వాలి



ఖరీఫ్‌లో ఎనిమిది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే కోత సమయంలో నేలకొరిగి రూ. 40 వేలు నష్టం జరిగింది. రెండో పంటకు బోరుబావులు కింద వరిపంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నాం. ఇప్పటికే వరినారు పోసుకున్నాం. తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నాయి. రెండో పంటకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రబీసీజన్‌లో వరి పంట బాగా పండితే మా పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తా.

- రాము, ఉప్పరహాళ్ క్రాస్

సాగుకు నారు సిద్ధం చేశా..



రబీసీజన్‌లో 10 ఎకరాల్లో వరిసాగుకు నారు పోసుకున్నాం. నా సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు చేస్తున్నా. వర్షం వల్ల కొంత వరకు పంట నష్టం జరిగింది. పంట నమోదు కాలేదని ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. బయటి వ్యాపారులకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ ధర కన్నా తక్కువకు విక్రయించాను. పంట నమోదు కాని రైతుల ధన్యాం కూడా కొనుగోలు చేస్తే బాగుండేది.

- రామాంజనేయులు, ఉద్దేహాళ్

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు



రబీలో వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు లాభదాయక పంటలను గుర్తించుకుని సాగుచేయాలి. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు తీసుకుని రబీలో పంటలు సాగు చేయాలి. ఆరుతడి పంటలు సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

- సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్


వేరుకుళ్లు తెగులు సోకి ఎండిపోతున్న పప్పుశనగ పంట

పప్పుశనగకు వేరుకుళ్లు దెబ్బ

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటకు వేరుకుళ్ల తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి భూముల రైతులకు ఈ పంటే జీవనాధారం. సాగు చేసి రెండు నెలలు గడుస్తుండడంతో పంట పూత దశలో ఉంది. ఈ యేడాది మండల వ్యాప్తంగా 16,600 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు బాగా కురవడంతో పైర్లు ఏపుగా పెరిగాయి. పైరు కళకళలాడుతుండడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశించిన రైతులకు తెగులు ఆందోళన కలిగిస్తోంది. వేరుకుళ్ల తెగులు సోకి మొక్కలన్నీ నల్లబారి చనిపోతున్నాయి. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించినా పంటంతా నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో పంట దెబ్బతింటుందని ఒక వైపు దిగులు పడుతుండగా.. తెగులు సోకడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

తెగుళ్లు నీరుగారుస్తున్నాయి



వర్షాలు బాగా కురిసి పైర్లు ఏపుగా పెరిగాయి. దిగుబడులు బాగావస్తాయని ఆశగా ఉన్నాం. ఈ పరిస్థితుల్లో వేరుకుళ్ల సోకి పైరంతా నాశనమవుతోంది. ఎంత ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోతోంది. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతాం.

- దామోదర, రైతు, తగ్గుపర్తి

తేమశాతం అధికమై చనిపోతున్నాయి



భూమిలో తేమ శాతం అధికంగా ఉన్నందున వేర్లన్నీ నల్లబారి మొక్కలు చనిపోతున్నాయి. దీనికి పంట మార్పిడి చేయకపోవడం కూడా ఒక కారణం. సాఫ్ 400 గ్రాములు ఎకరానికి, ప్రొపికోనోజల్ 400 గ్రాములు ఎకరానికి, పైరు తడిచేలా పిచికారి చేయాలి. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

- పృథ్వీసాగర్, వ్యవసాయాధికారి, బెళుగుప్ప

న్యూస్‌బాక్స్

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గుంటూరు లైన్ డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో వెళ్లే పలు రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గనపల్లి సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య వర్కుల కారణంగా పూరి-యశ్వంతపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం. 22883) రైలును 20వ తేదీన, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22884)ను ఈనెల 21న, హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22831) రైలును ఈనెల 25న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22832)ను ఈనెల 20న, భువనేశ్వర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 02811) రైలును ఈ నెల 21న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 02812)ను ఈ నెల 23న డోన్-గుత్తి మీదుగా కాకుండా నంద్యాల, యర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం/ధర్మవరం స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు.

23 నుంచి న్యాయవిద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలోని న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 23నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గురువారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్కేయూ క్యాంపస్ లా డిపార్ట్‌మెంట్‌తోపాటు విజయనగర లా కాలేజ్ విద్యార్థులకు ఏక కాలంలో పరీక్షలుంటాయన్నారు. వీరందరికీ ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల బీబీఏ, బీకామ్ ఎల్ఎల్‌బీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు. ఎల్ఎల్ఎం ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలుంటాయని వివరించారు. అదేవిధంగా మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ, హానర్స్ విద్యార్థులకు ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లుగా 23 నుంచి 30వర కు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

అనంతపురం టౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రహణం మొర్రి పిల్లల కోసం శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయబాల ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజరు రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఏపీఆర్ ఆస్పత్రి డాక్టర్ల సహకారంతో పెదవిచీలిక, గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాధిత చిన్నారులకు ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి: ఈయూ


ప్రసంగిస్తున్న ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఐదేళ్లుగా నిలుపుదల చేసిన ఉద్యోగోన్నతులను వెంటనే కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి నిలుపుదల చేసిన నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకోసం ఇచ్చిన సర్క్యులర్ నం.పీడీ-1/2019ను కొంతమంది అధికారులు పక్కన పెట్టారని, విపరీతంగా పనిష్మెంట్లు ఇస్తున్నారని అన్నారు. వెంటనే సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్, జిల్లా కార్యదర్శి పీయస్ ఖాన్, మహిళా నాయకురాలు నాగమణి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఏపీ జేఏసి అమరావతి జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ దివాకర్, కొండయ్య, గోపాల్, ఓబుళరత్నం, రామాంజనేయులు, కల్లప్ప, ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఎన్ఎంయూఏతోనే సమస్యల పరిష్కారం'


రమణారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంయూఏతోనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. వైసీపీ హయాం నుంచి ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఎంయూఏ నాయకులు రమణారెడ్డిని అనంతపురం ఆర్ఎం కార్యాలయం వద్ద గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ... కార్మికుల అనేక సమస్యలపై ఎన్ఎంయూఏ పోరాటాలు చేపట్టి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని అన్నారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నైటవుట్ అలవెన్సుల చెల్లిపుకోసం జీఓ జారీ చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, అనిత, ఈశ్వరప్ప, అనంతపురం డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెలాఖరు దాకా గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంటనష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600లు చెలిస్తే రూ.32వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు చెలిస్తే రూ.32వేలు బీమా వర్తిస్తుందన్నారు. జొన్న పంటకు ఎకరాకు రూ.315లు చెలిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.525లు చెలిస్తే రూ.35వేలు, వరి పంటకు ఎకరాకు రూ.630లు చెలిస్తే రూ.42వేలు, పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.450లు చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. ఇదివరకు ఈనెల 15వతేదీ వరకు గడువు ఉండిందని, రైతుల సౌకర్యార్థం ఈనెలాఖరు దాకా ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫైనల్స్‌కు

ఎస్ఎస్‌బీఎన్.. బ్లూమూన్

అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలలో ఎస్ఎస్‌బీఎన్, కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆర్డీటీ స్టేడియంలో గురువారం సెమీఫైనల్స్ నిర్వహించారు. తొలి పోరులో అనంతపురం వివేకానంద డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో కదిరి జట్టు 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. సాయిప్రణీత్ 162 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన వివేకానంద 8.4 ఓవర్లలోనే 71 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో సెమీస్‌లో ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్ఎస్‌బీఎన్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 150, జయకృష్ణ 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్వీ డిగ్రీ కాలేజి 7.3 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌట్ అయింది. కదిరి బ్లూమూన్, ఎస్ఎస్‌బీఎన్ జట్ల మధ్య ఫైనల్ పోరు శుక్రవారం జరగనుంది. ఎస్కే యూనివర్శిటీ రెక్టార్ వెంకటనాయుడు, ఎస్వీ డిగ్రీ కాలేజీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్, పీడీలు శ్రీరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి


ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తున్న సానా సతీష్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 20వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని దివ్యాంగ క్రికెట్ ఆంధ్రా అసోసియేషన్ కన్వీనర్ రోషిరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం అమరావతిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ చేతుల మీదుగా ప్రారంభించారు. 20వ తేదీన పేర్ల నమోదు పూర్తి చేసి, 21న ఎంపిక ప్రక్రియ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. వివరాల కోసం 9703400870, 7780167625, 6305354511 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా ఎంపికయ్యారు. జనవరి 4 నుంచి త్రివేండ్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి వారిని అభినందించారు.


అర్షియా


నేహా

టోల్ పెంపును రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో రెండు నేషనల్ టోల్‌గేట్ల మీదుగా ప్రయాణించే వాహనదారులపై వేల రూపాయల భారం పడుతోందన్నారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో కట్టబెడుతున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందని, దీనికితోడు ఆర్అండ్‌బీ రోడ్లపై టోల్ ప్రవేశపెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇది ప్రజలపై పెనుభారమవుతుందని తెలిపారు. ఈ మొత్తం టోల్ విధానాన్ని సమీక్షించి, తక్షణమే భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉంటే, వాటిలో 65 టోల్‌ప్లాజాలలో సింగిల్ ఎంట్రీ విధానం తీసుకువచ్చి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ రుసుములు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీనివల్ల సొంత, బాడుగ వాహనదారులపై అధికభారం పడుతుందన్నారు. ఈ విధానం వల్ల అద్దెవాహనాలు నడుపుకునేవారిపై తీవ్ర ప్రభావం పడి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదముందన్నారు. అనంతపురం-గుత్తి మధ్య గత సెప్టెంబరు వరకు ఒక కారు ఒకసారి వెళ్లి తిరిగి వచ్చినందుకు రూ.160లు చెల్లించేవారని, ఒకసారి టోల్ చెల్లించిన తర్వాత 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం రూ.160ల ఫీజును రూ.240లకు పెంచి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240లు చెల్లించేలా భారం మోపారన్నారు. ఇదే తరహాలో అన్నిరకాల వాహనదారులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో టోల్ చార్జీల పెంపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జనవరి 19వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది కార్గో సేవలు, డోర్ డెలివరీ విధానం గురించి ప్రజలందరికీ తెలియపరిచి, సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 2021 సెప్టెంబరు 1 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సదుపాయం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో అనంతపురంతోపాటు గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో డోర్ డెలివరీ విధానం అందుబాటులో ఉందని, 50 కేజీల బరువు వరకు పార్సిల్ బుకింగ్స్‌ను పార్సిల్ కౌంటర్‌కు 10కిలోమీటర్ల పరిధిలోపు గల వినియోగదారుల ఇళ్లవద్దకే చేర్చడం జరుగుతుందన్నారు. కార్గో సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన తీసుకొచ్చి, మాసోత్సవాలను విజయవంతం చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.

తప్పుల సవరణకు 23 వరకు అవకాశం

అనంతపురం విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల వివరాల తప్పుల సవరణకు ఈనెల 23వ తేదీ వరకు విద్యాశాఖ అవకాశం కల్పించినట్టు డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. దీనికి సంబంధించిన విద్యార్థుల నామినల్ రోల్స్(ఎన్ఆర్) వివరాలు ఏవైనా తప్పుగా నమోదై ఉంటే...వాటిని ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ సవరించడానికి పరీక్షల విభాగం డైరెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం..!

విధులను బహిష్కరించిన కార్మికులు
అదానీ ఫ్యాక్టరీలో గోప్యంగా విచారణ
శివకేశవ కుటుంబంలో తీవ్ర విషాదం
గాయపడ్డవారికి బెంగళూరులో చికిత్స

యాడికి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. వేడి చల్లారిన తరువాత కూలర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా.. అప్పటికప్పుడు చేయాలని ఆ విభాగం అధికారి కార్మికులపై ఒత్తిడి తెచ్చారని, అందుకే ఘోరం జరిగిందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రమాదం గురించి అధికారులు గురువారం విచారించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి సిబ్బందిని ఆరాతీశారని సమాచారం. అధికారులు వచ్చిన సమయంలో విలేకరులను ఫ్యాక్టరీ ఆవరణలోకి అనుమతించలేదు. విచారణ రహస్యంగానే కొనసాగింది. ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ అధికారులు, ఫ్యాక్టరీ అధికారులు ఎక్కువసేపు చర్చలు జరిపినట్లు కార్మికులు చర్చించుకుంటున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోకి విలేకరులు సహా ఎవరినీ రానివ్వకుండా పోలీసు, ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది భద్రతను కట్టుదిట్టం చేశారు. జరిగిన ప్రమాదం గురించి గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు, కార్మికులు వ్యాఖ్యానించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, యాడికి సీఐ ఈరన్న ఆధ్వర్యంలో యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి స్టేషన్ల సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కుటుంబ పెద్ద దిక్కు

పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రంగనాయకులు, భార్య గీతాదేవి, మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ ఉన్నారు. శివకేశవ తల్లిదండ్రులు కూలీలు. భార్య గీతాదేవి డీఎడ్ పూర్తి చేశారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పాఠశాలలోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు మహాదేవ్ యాదవ్‌కు మూడేళ్లు పడటంతో ఇటీవల పుట్టువెంట్రుకలు తీయించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శివకేశవ ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు, భార్య గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు దిక్కెవరని తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో వారు విలపించడం అక్కడున్నవారిని కలచివేసింది.

యాజమాన్యం నిర్లక్ష్యమే..

ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం విషయంలో యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు గురువారం విధులను బహిష్కరించారు. ఏ ఒక్కరూ లోపలికి వెళ్లకుండా, ఫ్యాక్టరీ ప్రధానగేటు సమీపంలో ఉండిపోయారు. ఫ్యాక్టరీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధిత కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందని వారు అన్నారు. చెడిపోయిన కూలర్‌లో వేడి తగ్గేదాకా ఆగి, 24 గంటల తర్వాత కార్మికులను మరమ్మతు పనులకు లోపలకి పంపించాల్సి ఉందని అన్నారు. త్వరగా మరమ్మతు చేయించాలని ఫ్యాక్టరీ అధికారి ఒత్తిడి చేయడంతోనే కార్మికులు కూలర్ డోర్ తెరిచారని, దీంతో ఒక్కసారిగా లోపల బ్లాస్ట్ జరిగిందని అన్నారు. బ్లాస్ట్ జరిగిన సమయంలో కూలర్‌కు ఉన్న ఇటుకలు, బొగ్గుపొడి కార్మికులపై పడటంతో ఒకరు మృతిచెందారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.


హాస్పిటల్ వద్ద రోదిస్తున్న శివకేశవ కుటుంబ సభ్యులు

రూ.30 లక్షల పరిహారం.. ఉద్యోగం

ప్రమాదంలో మృతిచెందిన శివకేశవ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వనున్నారు. శివకేశవ భార్యకు ఉద్యోగం, నెలకు రూ.10వేల దాకా పెన్షన్ అందిస్తారని తెలిసింది. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి కిష్టిపాడు గ్రామంలో రెండు ఎకరాల భూమిని కేటాయించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

అమ్మ ఒడిలో చిన్నారి..

శివకేశవ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే సమయంలో ఆయన మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ తల్లి ఒడిలో నిద్రిస్తూ కనిపించాడు. బాలున్ని చూసిన వారందరూ 'పాపం పిల్లవాడు.. వాళ్ల నాన్న చనిపోయాడని ఎలా తెలుస్తుంది..' అని ఆవేదన వ్యక్తం చేశారు.

బెంగళూరులో చికిత్స

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు షణ్ముకానందరెడ్డి, దీపక్‌సేన్, కంబగిరిరాముడు, బికాస్‌సాహు బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో షణ్ముకానందరెడ్డి, దీపక్‌సేన్‌కు శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని తెలిసింది. కంబగిరి రాముడు, బికాస్‌సాహు ఆరోగ్య పరిస్థితి బాగున్నట్లు తెలిసింది.

కేసు నమోదు

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై బాధితుడు, యాడికి మండలం చింతలాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని యాడికి యూపీఎస్ సీఐ ఈరన్న గురువారం తెలిపారు. బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్ చెడిపోయిందని, తక్షణమే మరమ్మతు చేయాలని సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారి ఆదేశించడంతో ఆరుగురు కార్మికులం మరమ్మతులు చేయడానికి బుధవారం రాత్రి వెళ్లామని బాధితుడు తెలిపారని సీఐ వివరించారు. కూలర్ వద్ద ఉన్న డోర్ తెరవడంతో ఒక్కసారిగా వేడి వేడి ఇటుకలు, బొగ్గుపొడి వచ్చిమీద పడిందని, దీంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఫ్యాక్టరీ సిబ్బంది వెంటనే వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారని తెలిపారు.


ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1125 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర ఏడు రూపాయలు పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ.. టన్ను రూ. 24 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 10టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 636 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 317 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

బాలుడిని మింగిన నిర్లక్ష్యం..!

మురుగు గుంతలో తేలిన శవం..
కన్నీటి సంద్రంలో కుటుంబ సభ్యులు


బాలుడి మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు


మహ్మద్ అల్మాస్ (ఫైల్)


మృతికి కారణమైన మురుగునీటి గుంత

పెనుకొండ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలుడి అదృశ్యం విషాదాంతమైంది. నాలుగేళ్ల పసివాడిని నిర్లక్ష్యం పొట్టనబెట్టుకుంది. ఆడుకుంటూ వెళ్లి మురుగు గుంతలో పడి మరణించినట్లు తేలింది. మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికితీశారు. దీంతో బాలుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవాలకు వేలాదిగా జనం వస్తారని తెలిసినా.. కాంట్రాక్టర్ పెద్ద గుంత తవ్వి, అందులోకి మురుగు నీరు వదిలారు. అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దానిపై కప్పు కూడా వేయలేదు. ఆ నిర్లక్ష్యమే బాలుడిని బలిగొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండలో బాబయ్యస్వామి ఉరుసు జరుగుతోంది. కర్ణాటకలోని చిత్రదుర్గ పట్టణానికి చెందిన జాఫర్.. భార్య సల్మా, కుమారులు ఫర్హాన్, మహ్మద్ అల్మాస్ (4), బంధువులు పర్వీన్, గుల్జార్ బానుతో కలిసి ఈనెల 17న ఉరుసుకు వచ్చారు. అదేరోజు సాయంత్రం మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్గా వెనుకభాగంలో మురుగునీరు వెళ్లేందుకు పెద్ద గుంత తవ్వారు. పోలీసులకు అనుమానం వచ్చి అందులోని నీటిని బుధవారం కొంతవరకు తోడించారు. గురువారం ఉదయం బాలుడి శవం తేలింది. పోలీసులు బయటకు తీశారు. అది అదృశ్యమైన బాలుడిదేనని కుటుంబీకులు గుర్తించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ మహబూబ్ బాషా.. మురుగునీటి కోసం పెద్దగుంత తీశాడు. మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ వెళ్లి అందులో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యులపై చర్యలు: వెంకటేశ్వర్లు, డీఎస్పీ

దర్గా పరిధిలో మురుగునీటి నిర్వహణకు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. మృతికిగల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటాం.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, పెళ్లి కాలేదని మనస్తాపం చెంది పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కిరణ్ (36) గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పరిధి పోతుకుంట బ్రిడ్జి సమీపాన రైలు కింద పడి మరణించాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌కు చెందిన పుల్లయ్య కుమారుడు కిరణ్ కూలిమగ్గం నేస్తుండేవాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండేవాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వారి బాధ్యత కిరణ్‌పై పడింది. ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉన్నారు. అప్పులు చేసి, పెద్ద చెల్లెలికి వివాహం చేశాడు. రెండో చెల్లెలు ఎంసీఏ పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తోంది. కిరణ్ వివాహం చేసుకుందామంటే ఎవరూ అమ్మాయిని ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. కీమన్ సమాచారంతో ధర్మవరం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాగొద్దన్నందుకు ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్నారని మందలించినందుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన పూలశెట్టి సురేష్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు. ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి, చేతికి రాడ్ వేశారు. ఆ ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రతి రోజు మద్యం తాగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించేవారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామును తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అనంతపురం సంఘమిత్ర కాలనీకి చెందిన షేక్ షెక్షావలి(26) గురువారం ఉరి వేసుకున్నాడు. షెక్షావలి బొరుగుల వ్యాపారి. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు చెప్పినా మారలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం 7గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల ఒత్తిడితో..

అనంతపురం నగరంలోని శారదానగర్‌కు చెందిన సోమశేఖర్ (42) గురువారం రాత్రి 7.30గంటల సమయంలో జేఎన్టీయూ సమీపంలోని పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్నాడు. అప్పుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

యువతి అదృశ్యం...

అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన షేక్ నసీమా అదృశ్యమయ్యారు. ఈమె ఓ షో రూమ్‌లో పనిచేసేవారు. కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం ఉదయం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో తల్లి వహీదా అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో ఘర్షణ

గార్లదిన్నె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో కొందరు యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గార్లదిన్నెకు చెందిన నాగార్జున, జగదీష్, రామ్మోహన్‌రెడ్డి, నాగులగుడ్డం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ డాబా సమీపంలో మద్యం సేవించారు. మాటా మాటా పెరిగి గొడవ పడ్డారు. ఘర్షణ తారస్థాయి చేరి ఒకరినొకరు కొట్టుకున్నారు. నలుగురూ గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన రామ్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. నాగార్జున, జగదీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

సొంతింటి కోసం చోరీలు

ముఠా ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్
నలుగురి అరెస్టు.. ఇద్దరు పరారీ
ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో రికవరీ


అరెస్టయిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఓ ఎలక్ట్రీషియన్ దొంగ అయ్యాడు. మరికొందరితో ముఠాగా ఏర్పడి.. తనకు తెలిసిన విద్యను చోరీలకు వాడుకున్నాడు. పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. తోటలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం వైర్లను చోరీ చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అనంతపురం సీసీఎస్, రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు పరారీ అయ్యారు. వారి నుంచి 450 కిలోల రాగి వైరు, 180 కిలోల అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికాలంలో జరిగిన 33 దొంగతనాల్లో రికవరీ చూపించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ జగదీష్ గురువారం వివరాలను వెల్లడించారు.

సొంతింటి కలతో మొదలు

కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర ముఠాలో కీలక వ్యక్తి. ఇతను ఎలక్ట్రీషియన్. విద్యుత్ శాఖ స్థానిక అధికారులు, హెల్పర్లకు సాయంగా పనులకు వెళ్లేవాడు. సొంత ఇల్లు కట్టుకోవాలని చిరకాల కోరిక ఉంది. కూలి డబ్బులు కుటుంబ పోషణకే సరిపోయేవి. ఇంటి నిర్మాణం కోసం చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అనుభవం ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి, అల్యూమినియం వైర్లను చోరీ చేయాలని భావించాడు. అదే మండలానికి చెందిన విద్యుత్ బిల్లులు తీసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చిరంజీవి, పరంధామను జత చేసుకున్నాడు. ఆ తరువాత కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన వాసు, వెంకటాంపల్లికి చెందిన వన్నూరు స్వామి అలియాస్ జానీ కూడా తోడయ్యారు.

అనువైన ప్రాంతాలను గుర్తించి..

వన్నూరుస్వామి, ఎర్రిస్వామి దొంగతనం చేయడానికి అనువైన ప్రదేశాలను, రాగి వైర్ కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి.. రాఘవేంద్రకు సమాచారం చేరవేసేవారు. ఆ తరువాత చోరీలు చేసేవారు. ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో చోరీలు చేశారు. రాగి, అల్యూమినియం వైర్లను సంచుల్లో తరలించేవారు. అమ్మేందుకు సులువుగా ఉండేలా వైర్లను ముద్దలుగా చేయించి, కక్కలపల్లి సమీపంలోని ఓ గుడిసెలో దాచారు. హైదరాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధమైన సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాఘవేంద్ర, చిరంజీవి, పరంధామ, ఎర్రిస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. వాసు, వన్నూరు స్వామి పరారీలో ఉన్నారు. వాసుపై కంబదూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. ఈ ముఠాపై 33 దొంగతనం కేసులు ఉన్నాయి. కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ పరిధిలో 6, పుట్లూరులో 6, అనంతపురం రూరల్-3, కంబదూరు-3, రాప్తాడు-3, చిలమత్తూరు-2, ఇటుకలపల్లి -2, యాడికి-2, బుక్కరాయసముద్రం-2, గార్లదిన్నె-1, కుందుర్పి-1 కేసు నమోదయ్యాయి. రాఘవేంద్రపై 8 కేసులు, వాసుపై 3 కేసులు, ఎర్రిస్వామిపై 2 కేసులు ఉన్నాయి. పాత కేసుల్లో వీరు ముద్దాయిలు.


వైర్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

నిఘా వేసి..

వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై నిఘా వేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. దీంతో ఏఎస్పీ రమణమూర్తి పర్యవేక్షణలో అనంతపురం సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి, అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు ప్రత్యేక నిఘా వేశారు. సీసీఎస్ హెడ్‌కానిస్టేబుళ్లు మల్లికార్జున, చంద్రశేఖర్, శ్రీధర్‌ఫణి, శ్రీనివాసులు, నరసింహులు, వెంగప్ప, కానిస్టేబుళ్లు రంజిత్‌కుమార్, బాలకృష్ణ, షామీర్, అనంతపురం రూరల్ హెడ్‌కానిస్టేబుళ్లు గిరిబాబు, ప్రసాద్, కానిస్టేబుళ్లు రాజు, శివయ్య, ప్రసాద్, పాండవ, అనిల్‌కుమార్ ప్రత్యేక బృందంగా ఏర్పడి ముఠాపై నిఘా వేశారు. కక్కలపల్లి సమీపంలోని ఓ గుడిసెలో దాచిన రాగి, అల్యూమినియం వైర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతగా పనిచేయాలి

ఆర్టీఓలు, రవాణా ఇన్‌స్పెక్టర్లకు జేటీసీ ఆదేశం


మాట్లాడుతున్న జేటీసీ కృష్ణవేణి

హిందూపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతి రవాణా అధికారీ బాధ్యతగా పనిచేయాలని రాయలసీమ జిల్లాల జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో గురువారం రవాణాశాఖ ప్రాంతీయ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు కొనివ్వడం తప్పుకాదు కానీ, వారిని కనిపెట్టుకుని ఉండాలనారు. వాహనం ఎలా నడుపుతున్నారో తెలుసుకుని, తగిన సలహాలు ఇవ్వాలన్నారు. చలానాల రూపంలో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఆర్టీఓలు కరుణసాగర్ రెడ్డి, శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు వరప్రసాద్, రాణి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

చిలమత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు మధుపై అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. చిలమత్తూరు పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను లైంగికంగా వేధిస్తుండేవాడు. బాలిక.. విషయాన్ని తల్లికి చెప్పింది. బాలిక తల్లిని కూడా మధు బెదిరించడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం దీనిపై పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో మధు నేరం చేసినట్లు రుజువవడంతో న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



నేను సీఐడీ ఆఫీసర్‌ను..!

అగ్రిగోల్డ్ భూముల్లోకి వెళ్లేవారికి సర్వేయర్ బెదిరింపులు?

పుట్లూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఎవరండీ అగ్రిగోల్డ్ భూముల విషయంలో మాట్లాడేది..? నేను కర్నూలు నుంచి సీఐడీ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..' అంటూ ఓ సర్వేయర్ హల్‌చల్ చేస్తున్నాడు. 'మీకు ఏమి సమాచారం కావాలన్నా నన్ను అడగండి..' అంటూ కొందరిని బెదిరిస్తున్నటుల సమాచారం. మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆ భూముల జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తామని అక్కడకు వెళ్లిన వామపక్ష నాయకులను, చూసేందుకు వెళ్లిన అధికారులను వైసీపీ నాయకుడు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని, ఇప్పుడు వెళ్లమంటే ఎలా అంటూ మండిపడుతున్నాడు. దీంతో అధికారులు ఏమీ చేయలేకున్నారు. ఈ క్రమంలో ఓ సర్వేయర్ ఆ భూములు మొత్తం తన పరిధిలోనే ఉన్నాయంటూ హంగామా చేస్తున్నాడు.

కన్నెత్తి చూడని అధికారులు

అగ్రిగోల్డ్ భూములను వైసీపీ నాయకుడు సాగుచేస్తున్న విషయం తెలిసినా జిల్లా అధికారులు, సీఐడీ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ఆంధ్రజ్యోతి కథనాలతో కొందరు అధికారులు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేసినా.. బెదిరింపులతో మిన్నకుండిపోతున్నారని సమాచారం. ఆ ప్రాంతానికి వెళ్లిన వామపక్ష ప్రజా సంఘాల నాయకులకు ఓ సర్వేయర్ సీఐడీ ఆఫీసర్ అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుడే దగ్గరుంచి ఫోన్ చేయిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. వంద ఎకరాలకుపైగా అగ్రిగోల్డ్ భూములు సాగు చేస్తున్న వైసీపీ నాయకుడు కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తగ్గడం లేదు. ఉన్నతాధికారులతో సయోధ్య కోసం టీడీపీ నాయకులద్వారా రాయబేరాలు నడుపుతున్నట్లు తెలిసింది. భూముల విషయంలో సీఐడీ అధికారి పేరిట సర్వేయర్ ఫోన్ చేసిన విషయం తన దృష్టికి రాలేదని మండల సర్వేయర్ శాంతి అన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అగ్రిగోల్డ్ భూముల ముఖద్వారం

మెప్మాలో అక్రమాలపై ఫిర్యాదు

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అక్రమాల డొంక కదులుతోంది. బోగస్ మహిళా సంఘాలను సృష్టించి, రుణాలు కాజేయడంపై ఓ బ్యాంకు అధికారి.. గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెప్మాలో పనిచేసే టీఎంసీ వెంకటేశ్‌తో, ఆర్పీ శోభారాణిపై ఫిర్యాదు అందజేశారు. గత వైసీపీ హయాంలో మెప్మాలోని కొందరు ఏకమై రూ.3కోట్లకుపైగా బోగస్ సంఘాల మాటున రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించకుండా బ్యాంకర్లకు ముప్పుతిప్పలు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే తరహాలో ఇటీవల టీఎంసీ, ఆర్పీ కలిసి యాక్టివ్‌గాలేని గ్రూపులను బయటకు తీశారు. ఇతర సంఘాల్లోని కొందరిని చేర్చి, సీఓల ప్రమేయం కూడా లేకుండా బ్యాంకర్ల కళ్లుగప్పి భారీ ఎత్తున రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. ఓవర్‌సీస్ బ్యాంకుల్లో ఐదు బోగస్ సంఘాలను సృష్టించి, రూ.కోటిదాకా రుణాలు తీసుకున్నట్లు ఆ బ్యాంకు అధికారులు.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు అధికారులు కంగుతిన్నారు. ఎవరి ప్రమేయంతో రుణాలు తీసుకున్నారో అందుకు బాధ్యులైన మెప్మా అధికారి వెంకటేశ్, ఆర్పీతోపాటు సిబ్బందిని పిలిపించి నిలదీయడంతో బోగస్ సంఘాల పేరుతో తీసుకున్న రుణాలను చెల్లిస్తామనీ, అందుకు గడువు కోరినట్లు తెలుస్తోంది. వారిచ్చిన గడువు కూడా దాటిపోవడంతో చేసేదిలేక ఓవర్‌సీస్ బ్యాంకు అధికారులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మెప్మా అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

సంక్షిప్తం

బీమా ప్రీమియం కట్టించండి

● ఏఓలకు ఏడీఏ ఆదేశం

అనంతపురం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని ఏఓలను ఏడీఏ రవి ఆదేశించారు. వ్యవసాయ శాఖ అనంతపురం డివిజన్ కార్యాలయంలో గురువారం ఏఓలతో ఆయన సమీక్షించారు. వేరుశనగ, మొక్కజొన్న, వరి, పప్పుశనగ, టమోటా, మామిడి పంటలకు ఇదివరకు ఈనెల 15 వరకు గడువు ఉండేదని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నెలాఖరుదాకా గడువు పొడిగించిందన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మటన్ మార్కెట్‌లో నీటి సమస్యను పరిష్కరించేందుకు టీడీపీ నాయకులు చర్యలు చేపట్టారు. ఆ పార్టీ నాయకుడు మంగళ రాము ఆధ్వర్యంలో గురువారం బోరు వేయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల సిద్ధార్థ ఇచ్చిన హామీ మేరకు... ఇటీవల మట్టిని తోలించి కాలనీలో రోడ్డును చదును చేయించామన్నారు. అదేవిధంగా నీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచు శివశంకర్, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు కురుగుంట నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి రైతుల కృతజ్ఞతలు



ఎస్ఐని సన్మానిస్తున్న జి. కొట్టాల రైతులు

రామగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌కు పామిడి మండలం జి. కొట్టాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. వారం రోజుల కిందట జి కొట్టాల గ్రామంలో రైతు సుదర్శన్ పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్‌యాదవ్ రైతుకు ఐదు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వితరణగా అందించారు. దీంతో ఆ రైతులు గురువారం రామగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు. రైతుల కష్టాలను ప్రతి ఒక్కరు గుర్తించాలని ఎస్ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో రామగిరి మాజీ ఎంపీపీ పరంధామయాదవ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో తరణి అనే మహిళ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన ధనుంజయ, తరణి దంపతులు తమకున్న భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. అయితే ఆమె గురువారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామంలో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలకు తెలుగు రైతు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి గురువారం ఆర్థిక సాయం చేశారు. రెండు రోజుల కిందట మృతిచెందిన వైఎస్సార్ కాలనీకి చెందిన అబ్దుల్ సత్తార్ కుటుంబాన్ని, గురువారం సాకే ఎరికల సుంకన్న కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కుటుంబాలకు టీడీపీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సునీల్, ధర్మేంద్ర, రంగా యాదవ్, జాఫర్, వీరేష్, అక్కులప్ప, వెంకటేష్, గోపాల్, తిరుమలేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సొంత కారు.. బినామీ పేరు..

● నెలనెలా రూ.35 వేలు డ్రా
● వెలుగులోకి ఓ అధికారి నిర్వాకం



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలో కాసులకు కక్కుర్తి పడుతున్న ఓ అధికారి అక్రమాలు ఒక్కొక్కటికి వెలుగులోకి వస్తున్నాయి. ఇదివరకూ వికలాంగుల సంక్షేమ శాఖ లబ్ధిదారులకు అందించే స్కూటీలు, ట్రైసైకిళ్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు తదితర వాటిలో ఆ అధికారి కమీషన్ల ద్వారా కాసులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఆ శాఖ రాష్ట్ర అధికారులతోపాటు... జిల్లా ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తూ... సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఆయన సొంత కారును బినామీ పేరుతో కార్యాలయానికి ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. దానిని ఐదారేళ్లుగా ఓ వైపు శాఖ పనులకు... మరో వైపు సొంత పనులకు వాడుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ శాఖలోని దిగువస్థాయి అధికారిని తనకు అనుకూలంగా మార్చుకొని కారు బాడుగకు సంబంధించిన బిల్లులను డ్రా చేస్తున్నట్లు సమాచారం. నెలనెలా రూ.35 వేలు బిల్లులు డ్రా చేస్తుండటం బయటికి పొక్కడంతో... పలువురు దివ్యాంగులు, సంఘాల నాయకులు ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రాష్ట్రస్థాయి అధికారులు విచారణకు ఆదేశించడంతో ఆ అధికారి మూడు నెలలుగా ఆ కారును కనిపించకుండా చేసినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా విచారణకు ఎవరొచ్చారో... ఏం విచారణ చేశారో ఇప్పటికీ బయటకు రాలేదు.

అవినీతి ఆరోపణలపై కలెక్టర్ సీరియస్..?

విభిన్న ప్రతిభావంతుల శాఖలో దివ్యాంగుల సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించడం... కాసులు దండుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించిన కలెక్టర్ ఆ శాఖ అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా అధికారులతో మాట్లాడి, అసలు ఏం జరుగుతోందని ఆరా తీసినట్లు సమాచారం. ఆ అధికారిపై విచారణకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు సైతం ఆ అధికారిపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఆ అధికారిపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై వారు నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

మున్సిపల్ కార్పొరేషన్ అక్రమాలపై చర్యలేవీ..?

● సీపీఐ నగర నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి శ్రీరాములు, ఇతర నేతలు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో వందల కోట్ల విలువైన స్థలాలు కబ్జాకు గురువుతున్నాయన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ స్థలాలపై గత నెల కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు అపార్టుమెంట్ల నిర్మాణాల వద్ద కాసులకు కక్కుర్తిపడి నిబంధనలను గాలికొదిలేస్తున్నారంటూ మండిపడ్డారు. నగరంలోని 2018 నుంచి నేటి వరకూ మున్సిపల్ కాంప్లెక్స్‌ల నుంచి రూ.300 కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అవినీతిపై, అక్రమాల కట్టడికి ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయకార్యదర్శులు అల్లిపీరా, రమణ, నాయకులు చాంద్‌బాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి: సీపీఎం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో గుత్తిరోడ్డులోని ఎస్ఎస్ గ్రాండ్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆటోస్టాండ్ వద్ద మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... మహాసభల నేపథ్యంలో వేలాదిమందితో నగరంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వీ నాయుడు, వెంకటనారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఏటీఎం నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై చర్యలు చేపట్టాలని వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందమ్మపల్లిలో గాయత్రి వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు ఆ అసోసియేషన్‌కు చెందిన బ్రాహ్మణులు తహసీల్దారు పుణ్యవతికి ఫిర్యాదు చేశారు. గోవిందమ్మపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు విన్నవించారు. గోవిందమ్మపల్లిలోని సర్వే నంబరు 272-1, 280, 281 లోని 11.18ఎకరాలను 1990లో గాయత్రి వెల్ఫేర్ కు చెందిన పేద బ్రాహ్మణులు కొనుగోలు చేశారు. ఈ స్థలానికి సంబంధించి అప్పటి కలెక్టర్‌తో ఎన్ఓసీ తెచ్చుకుని 225 మంది విడి విడిగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. అయితే పదేళ్ల క్రితం కొంత మంది రాజకీయ నాయకులు పలుకుబడితో దౌర్జన్యంగా గుడిసెలు, ఇళ్లు నిర్మించుకున్నారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. 225 బాధితులకు ఎక్కడా ఇళ్ల స్థలాలు లేవని అందరూ నిరుపేదలేనని, కబ్జాదారులను శిక్షించాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను కోరారు. గుడిసెలు తొలగించాలని పదేళ్లుగా పోరాటాలు చేస్తున్నా న్యాయం జరగలేదన్నారు. ప్రతి సారి రాజకీయ నాయకుల అండదండలతో అధికారులు రక్షిస్తున్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో.. న్యాయం జరుగుతుందనే ఆశా భావంతో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బాధితుడికి చేయూత

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నందమూరి నగర్ త్యాగ రాజ కాలనీలో నివాసముంటున్న బాషా అనే వ్యక్తి క్యాన్సర్‌తో బాధపడు తున్నాడు. రెక్కాడితేకానీ డొక్కాడని ఆ కు టుంబ పరిస్థితిని తెలుసుకున్న నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి గురువారం ఆ కుటుంబాన్ని కలిసి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాతో భవిష్యత్తులో వెలుగులు

● ఎస్ఈ సంపత్‌కుమార్



బహుమతులు పొందిన విద్యార్థులతో విద్యుత్ అధికారులు

అనంతపురం రూరల్/విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఆదా చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాలకు వెలుగులు అందించవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ పేర్కొన్నారు. విద్యుత్తు పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం గుత్తిరోడ్డులోని మాంటిస్సోరీ స్కూల్‌లో విద్యుత్తు శాఖ డి-6సెక్షన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్ఈ సంపత్‌కుమార్, టౌన్‌డివిజన్ ఈఈ జేవీ రమేష్ హాజరై మాట్లాడారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ప్రసన్న, గీతిక, భువన్, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన శివప్రజ్ఞ, షాహిద్, రితీషకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో డీఈఈలు శ్రీనివాసులు, రామకృష్ణ, ఏఈఈ ప్రసాద్, ఏఓ గంగన్న, పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత న్యాయస్థానాల్లో... ఎస్సీ ఎస్టీ బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి'



ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్‌ను కలిసిన రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉన్నత న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో ఆజాద్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు నగీనా పార్లమెంట్ సభ్యుడు చంద్ర శేఖర్ ఆజాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 29రాష్ట్రాల హైకోరుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే పార్లమెంట్‌లో చర్చ జరిగిందని, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మెహవాల్ ఇచ్చిన సమాధానంలో ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లు లేవని తెలిపారన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని సిఫారసు చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రప్రభుత్వాన్ని కోరిందని గుర్తుచేశారు.

గురువుల ప్రోత్సాహంతోనే విద్యార్థుల పురోగతి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అహుడా చైర్మన్, ఏజీఎం

అనంతపురం విద్య డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గురువుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు అన్ని రంగాల్లో పురోగమిస్తారని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం గురువుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీసీ వరుణ్ మాట్లాడుతూ... విద్యార్థుల ఎదుగుదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గురువులు ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తూనే ఉంటారన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థికి 598 మార్కులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకడమిక్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ, ఇర్షాద్, తిరుమలేష్, నాగభూషణం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అరవిందనగర్ సర్వేశ్వరాలయంలో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి మండల పూజలో భాగంగా గురువారం పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పడిపై వినాయకు, లక్ష్మీదేవి, అయ్యప్ప స్వామి చిత్రపటాలను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం దీక్షధారులకు భిక్షను అందజేశారు. ప్రధానార్చకుడు గురుమూర్తి పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో తిరుప్పావై పఠనం



తిరుప్పావై పఠిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయంలో తిరుప్పావై పఠనాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్లకు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహికంగా తిరుప్పావై పాశురాలు పఠించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనానికి సంసిద్ధం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హనుమాన్ చాలీసా ప్రచార సమితి, పవన యువజన సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 4వ తేదీన భారీ ఎత్తున హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో బుధవారం నుంచి నిర్వహిస్తున్న సన్నాహక కార్యక్రమం గురువారం ఘనంగా ముగిసింది. రెండోరోజు కార్యక్రమంలో నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. దాదాపు 56 పాఠశాలల విద్యార్థులు పాల్గొని సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ప్రమోద్‌స్వామి, శ్రీపాద వేణు, సుంకు వేణుగోపాల్, ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్, ఆకుల రాఘవేంద్ర, గల్లా హర్ష, హర్షద్ జైన్, విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, హనుమాన్ చాలీసా ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కుళ్లాయిస్వామి



అనంతపురం విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శిగా జిల్లాకు చెందిన కుళ్లాయిస్వామిని నియమించారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో తనను ఎన్నకున్నట్లు ఆయన గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ స్థాయిలోనే ఏఐఎస్ఎఫ్‌లో చేరిన తనకు రాష్ట్ర స్థాయి నాయకుడిగా అవకాశం కల్పించినందుకు సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఈ బాధ్యతతో మరింతగా పోరాటం చేస్తామన్నారు.

పాలిటెక్నిక్ ప్రాంతీయ బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల ప్రాంతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను గురువారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. శాప్ కోచ్ నరేష్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల పీడీ రఘు ఆధ్వర్యంలో సాగిన సింగిల్స్ పోటీల్లో ... బాలురలో విష్ణు, బాలికల్లో జాహ్నవి విజేతలుగా నిలిచారు. డబుల్స్ బాలురలో రాజేష్-పవన్ జోడి, బాలికల్లో ధరణి-జయంతి జోడి గెలుపొందారు.

ఘనంగా ఎంపీ అంబికా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్/ ప్రెస్‌క్లబ్/ బుక్కరాయసముద్రం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగర శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలు ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం నాయకులు ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరికొందరు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఎంపీ అంబికా జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అక్కడే రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికాకు ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండ రామిరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎంపీ తన జన్మదిన కానుకగా ఐఎంఎం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓ నిరుపేద ముస్లిం యువతి వివాహానికి రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎంపీ జన్మదినం సందర్భంగా అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ సవేర, శ్రీనివాస మల్టిస్పెషాలిటీ, భార్గవి అర్జున్ ఆసుపత్రి, గురు కృపా పిల్లల ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేశారు.



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కోదండరామిరెడ్డి

గాండ్ల, తెలికలు చైతన్యంతో ముందడుగు వేయాలి

● టీడీపీ గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి



సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విశాలాక్షి

అనంతపురం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులు, శాస్త్ర, సాంకేతిక, రాజకీయ రంగాల్లో గాండ్ల, తెలికులు చైతన్యంతో ముందడుగు వేయాలని టీడీపీ గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి పేర్కొన్నారు. స్థానిక గుత్తి రోడ్డులోని అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం విశాఖ పట్నం జైళ్ల విభాగం డీఎస్పీ సాయి ప్రవీణ్, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెరవలి రాముతో కలిసి 2025 వార్షిక క్యాలెండర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాలాక్షి మాట్లాడుతూ... గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కులస్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామయ్య, లక్ష్మీనారాయణ, రామాంజి నేయులు, రెడ్డయ్య, గంగాధర్, కేపీకుమార్, నరసింహులు, రమేష్ బాబు, రవికుమార్, శ్రీనివాసులు, అనిల్ బాటి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని 28 దుకాణాలు సీజ్

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలో అద్దె బకాయిలు చెల్లించని 28 దుకాణాలను కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో 28 దుకాణాలకు సంబంధించి మొత్తం జీఎస్టీతో కలిసి రూ.కోటి వరకు బకాయిలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. తాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బకాయి పడిన దుకాణాలపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో రెవెన్యూ అధికారులు గురువారం ఆ దుకాణాలను సీజ్ చేశారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అనంతపురం న్యూటౌన్/విద్య/కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్, సీపీఐ , కేవీపీ ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు, అనంతపురం అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ దాదాగాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన పార్టీ రాష్ట్ర నాయకుడు శంకర్, నాయకులు వాసు, ఇమామ్, శంకర్‌యాదవ్, రాంబాబు, లోకేష్, శర్మాస్ వలి, నిశాంత్‌రెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఆ పార్టీ జడ్పీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు రమణయ్య, అల్లిపీరా, ఇతర నేతలు సంతోష్, మోహన్‌కృష్ణ, హనుమంతు, శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కేవీ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ని వాళులర్పించి, అనంతరం అక్కడే నిరసన వ్యక్తం చే శారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు జీవరత్నం, రాజా, అక్కులప్ప, సీఐటీయూ నాయకుడు ఏటీఎం నాగరాజు, కేవీపీఎస్ నాయకుడు నాగేంద్ర, నారాయణస్వామి, డేవిడ్, ఎమ్మార్పీఎస్ నగరాధ్యక్షుడు వెంకటేశులు, కార్తీక్, నాగు, నాగభూషణం, రామన్న తదితరులు పాల్గొన్నారు.

అదానీపై కేసులు నమోదు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాడికి మండలం బోరెడ్డిపల్లి వద్ద గల అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న ప్రమాదం ఘటనలో అదానీపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే మెజిస్ట్రేట్‌తో సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో సలసలా కాగే ఇటుకలు, బూడిద చల్లారకుండానే యాజమాన్యం కార్మికులతో పనిచేయించడం దుర్మార్గమన్నారు.

క్లుప్తంగా..

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరభద్రస్వామి, సీఐటీయూ జిల్లా నాయకుడు నరసయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీరభద్రస్వామి, నరసయ్య మాట్లాడుతూ. కార్మికులకు బట్టలు, కొబ్బరినూనె, సబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీస్, ఏజీటీయూసీ కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కును అందిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం గ్రామానికి చెందిన గోవిందరెడ్డి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 1,22,327 రూపాయలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు గురువారం అనంతపురంలోని తన స్వగృహంలో లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రతిష్టను దేశ నలుమూలలా చాటాలి

ఉరవకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీల్లో రాష్ట్ర ప్రతిష్టను దేశం నలుమూలలా చాటాలని సీఐ చిన్నగౌస్ సూచించారు. పట్టణంలోని ఆర్డీటీ ప్రాంగణంలో జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సీఐ గురువారం క్రీడాకారులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నెల 23నుంచి 27వ తేదీ వరకూ కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి షాహీన్, ఎస్ఐ జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గుత్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా పిలుపునిచ్చారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మల్కిసాబ్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను వేలం వేయాలి

విడపనకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో బసవేశ్వర, రామలింగేశ్వర దేవాలయ భూములను వేలం వేయాలంటూ ఆ గ్రామస్థులు దేవాదాయ శాఖ అధికారి రాణిని డిమాండ్ చేశారు. ఈ ఆలయంలో ఐదుగురు అర్చకులు ఉండగా.. నలుగురు మాత్రమే విధులకు వస్తున్నట్లు మార్చి 2024లో ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 43-10జీఓ ప్రకారం రూ. 5లక్షలు ఆదాయం ఉన్న ఆలయాలకు చెందిన భూములను అర్చకులే అనుభవించే హక్కులు కల్పించటంతో ఈ దేవాలయ భూమి 35 ఎకరాలు నలుగురికే చెందేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. 5వ అర్చకుడు తనకు అన్యాయం జరిగిందని దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయటంతో గురువారం అధికారి రాణి పాల్తూరుకు విచారణకు వచ్చారు. దీంతో గ్రామస్థులు ఆమె వద్దకు వచ్చి బసవేశ్వర, రామలింగేశ్వర ఆలయ భూమి నుంచి సంవత్సరానికి కౌలు ద్వారానే రూ. 15లక్షలు వస్తుందని, దీనికి 43-10 జీఓ ఏవిధంగా ఇస్తారని నిలదీశారు. ఆ పొలాలు కాలువ కింద ఉండడంతో దాదాపుగా ఎకరా రూ.40వేల నుంచి రూ.50వేలు కౌలు పలుకుతోందని, 35 ఎకరాలకు రూ.5లక్షలలోపు ఆదాయం ఉంటుందని తెలిపారు. దేవాలయ భూమిని వేలం పాట వేసి 43-10 నుంచి తొలగించాలని కోరుతు అధికారిని వారు తవెనక్కు పంపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి: కాంగ్రెస్

గుంతకల్లుటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. నియోజవర్గ సమన్వయకర్త దౌల్తాపురం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహోన్నత వ్యక్తి అయిన అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు పుట్టగతులుండవని ఆగ్రహించారు. అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు తరగం రామాంజనేయులు, నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, షేక్ మహబూబ్ బాషా కమాన్‌తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా చిత్రపటాన్ని ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ... అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు ధన తిమ్మప్ప, వన్నూరుస్వామి, నరసింహులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా వెంటనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలన్నారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు గౌని తిప్పేస్వామి, ఎర్ర రామాంజినేయులు, నిజవల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు


గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తాడిపత్రి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విద్యుత్ ఇంధన పొదుపు వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఉద్యోగులు స్థానిక కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలన్నారు. సహజసిద్ధమైన ఇంధనాలు తరిగిపోతే భవిష్యత్తు తరాల వారు ఇబ్బందులు పడతాయని తెలిపారు. ర్యాలీలో అధికారులు ప్రభాకర్‌రావు, నరసప్ప, శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ట్రాన్స్‌కో సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ రాజారావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. అనంతరం విద్యుత్ పొదుపుపై మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబరు-3లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

గుత్తి: పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఇంధన పొదపు వారోత్సవ ర్యాలీని నిర్వహించారు.స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఈఈ రాజశేఖర్, ఏడీఈ సాయిశంకర్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. ఇళ్లలో మరింత కాంతి కోసం గొడలకు తెలుపులాంటి లేత రంగులు వేస్తే ఇళ్లు కాంతివంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు మధుసూదన్‌రావు, సిబ్బంది నాగేంద్రప్రసాద్, సూర్యనారాయణ, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: విద్యుత్‌ను పొదపు చేద్దామని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదపు వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బీరప్ప సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ పొదుపుగా విద్యుత్‌ను వాడుకోవాలన్నారు. విద్యుత్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్
- మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చనిపోయిన శివకేశవ కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య గీత చంటిపిల్లాడితో ఉండడాన్ని గమనించిన జేసీపీఆర్ భావోద్వేగానికి గురయ్యాడు. యాజమాన్యంతో ఆయన సంప్రదింపులు చేసి బాధిత కుటుంబానికి రూ.30లక్షలు ఇచ్చేలా ఒప్పించారు. దీంతో పాటు పరిశ్రమ నుంచి వచ్చే బీమా, ఇతర ప్రయోజనాలను యథాతథంగా ఇవ్వాలని, మృతుడి భార్యకు కంపెనీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మృతుడు కాంట్రాక్ట్ కార్మికుడు కావడంతో ఆయకు వచ్చే ఆదాయాన్ని భార్యకు నెలనెలా వర్తింపజేయాని కోరారు. ఆమెకు రెండు ఎకరాలు భూమిని కిష్టిపాడులో ఇప్పిస్తామని తెలిపారు. జాయింట్‌కలెక్టర్ శివనారాయణశర్మతో ఫోన్‌లో మాట్లాడి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అంత్యక్రియలకు లక్షరూపాయలు అందజేస్తామని జేసీ హామీ ఇచ్చారు. తర్వాత ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందజేయాలని కోరారు. కలెక్టర్‌తో మాట్లాడి సాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, నరేంద్రనాయుడు, జయచంద్రారెడ్డి, వేలూరు రంగయ్య, చల్లా సూరి, మల్లికార్జునరెడ్డి, చిత్తరంజన్ రెడ్డి, వేలూరు రాజశేఖర్ నాయుడు తదితరులు ఉన్నారు.

ముగిసిన శివకేశవ అంత్యక్రియలు

పెద్దవడుగూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన శివకేశవ అంత్యక్రియలు స్వగ్రామమైన కిష్టిపాడులో గురువారం నిర్వహించారు. మృతుడు గ్రామంలోని అందరితో మమేకమై ఆప్యాయతగా పలకరించేవాడని, మృతిచెందడంతో తమ కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లు భావిస్తున్నామని గ్రామ ప్రజలు విచారం వ్యక్తం చేశారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి


నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

తాడిపత్రి: అదాని సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుడు శివకేశవ మృతిచెందాడని సీపీఐ నాయకులు రంగయ్య, చిరంజీవి, సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రామాంజనేయులు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేస్తే వారు కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద గల సిమెంట్ ఫ్యాక్టరీలో యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కార్మికుడు బలి అయ్యాడని అన్నారు. మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు అతడి భార్యకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్‌చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో సేఫ్టీ మెజర్‌మెంట్ లేక అనేకమంది కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నాయో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడుయాదవ్, నరసింహారెడ్డి, రాంమోహన్, ఉమాగౌడ్, చౌడయ్య, మధు తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు ధర్నా చేస్తున్న వారిని అరెస్ట్‌చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే మీరెందుకు అడుకుంటున్నారని నాయకులు పోలీసులపై మండిపడ్డారు. యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ మమ్మల్ని అరెస్ట్ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని వాపోయారు. కార్మికుల పట్ల యాజమాన్యం, పోలీసులు చిన్నచూపుచూడడం తగదని హెచ్చరించారు.

భూసమస్యలను పరిష్కరిస్తాం: ఆర్డీఓ


ముచ్చుకోటలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

పెద్దపప్పూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతుల అర్జీల ద్వారా తెలిపిన భూ సమస్యలను నిశితంగా పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. మండలంలోని ముచ్చుకోటలో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. రైతుల భూములకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎలాంటి భూ సమస్యలున్నా అర్జీల ద్వారా అధికారులకు తెలపాలన్నారు. 45రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలువురు రైతులు తహసీల్దార్ బాలాజీరాజుకు అర్జీలు అందజేశారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్వో లక్ష్మన్న, విలేజ్ సర్వేయర్ ప్రవళిక, సర్పంచు జయమ్మ, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు జరిగింది ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులను భూ సమస్యలున్న రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలువురు రైతులు 21 అర్జీలు ఇచ్చారని తహసీల్దార్ చెప్పారు. టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ కలెక్టర్

బెళుగుప్ప: ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆవులెన్న, ఎర్రగుడి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం పలువురు రైతులు వివిధ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. సర్పంచ్ రాము, తహసీల్దార్ షర్మిల, ఆర్ఐ రమాదేవి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌కు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు

యల్లనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మరో ఇద్దరు కానిస్టేబుళ్లను గురువారం వీఆర్‌కు పంపారు. ఈనెల 15న చిలమకూరు తిరుణాలలో బహిరంగంగా పేక, ముక్క ఆడించిన కేసులో ఉన్నతాధికారులు ఎస్ఐతోపాటు ఓ కానిస్టేబుల్‌ను రెండురోజులక్రితం వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ విషయంలో మరింత లోతుగా విచారించి మరో ఇద్దరిని కూడా వీఆర్‌కు పంపారు.

మహాసభలను విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 23,24 తేదీలలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసులు కోరారు. పట్టనంలో గురువారం ఆయన సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా మహాసభలకు పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడపై నుంచి పడి వ్యక్తి మృతి

నల్లమాడ డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నివాసముం టున్న ప్రైవేట్ డ్రైవర్ షామీర్ (45) ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి కిందపడి గురువారం రాత్రి మరణించాడు. తన ఇంటిలోని రెండో అంతస్తులోకి వాషింగ్ మిషన్ తీసుకొని వెళ్తుండగా.. కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు.

జీపు డ్రైవర్ల బైండోవర్

యల్లనూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జీపుడ్రైవర్‌లపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. రెండురోజులక్రితం మండలకేంద్రానికి చెందిన సురేష్ హత్యకేసులో ఇరువురి జీపు డ్రైవర్లను కొండాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ముందస్తు చర్యల్లో భాగంగా మిగిలిన జీపు డ్రైవర్లను గురువారం స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు. అనంతరం బైండోవర్ కేసు నమోదుచేసి తహశీల్దార్ రాజా ఎదుట హాజరుపరిచారు.

బీమా గడువు పొడిగింపు

యల్లనూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన పంటలకు బీమా చేసుకోవడానికి గడువు పెంచినట్లు ఏఓ రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ గడువు ఈనెల 15నాటికి ముగిసినప్పటికీ రైతుల కోరిక మేరకు ప్రభుత్వం ఈనెల 31 వరకు గడువు పెంచిందని అన్నారు. అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

నేడు అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

పుట్లూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామ శివారులో ఉన్న అగ్రిగోల్డ్ భూములను శుక్రవారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పరిశీలించనున్నట్లు ఆ పార్టీ నాయకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీజ్‌చేసిన భూములను పరిశీలించి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు జిల్లా నాయకులు హాజరవుతారని అన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

బొమ్మనహాళ్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సుస్థిర అభివృద్ధిపై సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి జరిగిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈఓపీఆర్డీ దాస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని, పేదరిక నిర్మూలన చేపట్టాలని శిక్షణ ఇచ్చినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు. పంచాయతీరాజ్ జేఈ జగదీష్, సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, జూనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బొమ్మనహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ క్రాస్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఏఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కృష్ణాపురం గ్రామానికి చెందిన ఉజ్జానప్ప(65) , అదే గ్రామానికి చెందిన హరి, ఉద్దేహాళ్‌కు చెందిన నాగరాజుశెట్టి కలిసి బైక్‌లో కణేకల్లు క్రాస్ వైపు బయలుదేరారు. గోనేహాళ్ క్రాస్ సమీపంలోకి రాగానే గొర్రెలకాపరి బస్తాను మోసుకుంటూ అడ్డంగా రావడంతో, అతనిని తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డారు. ఉజ్జానప్పకు తీవ్ర గాయాలవడంతో బళ్లారి విమ్స్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తమ్ముడు బసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కణేకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎక్సైజ్ సీఐ ఉమాబాయి ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ పరిసరాల్లో ఉన్న నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితులు పరారీలో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఎస్ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుళ్లు ఫణీంద్ర, మారుతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామంలో మంగలి గోపి అనే వ్యక్తి వద్ద 96 టెట్రా ప్యాకెట్లు, కుందుర్పిలో బోయ అనసూయమ్మ వద్ద 120 టెట్రా ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని సీఐ సునీల్ తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వారి ఇళ్లపై దాడులు చేశామన్నారు. అనందరం ఆ ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడులలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన శ్రీనివాసులు, రాయదుర్గానికి చెందిన శ్రీరాములు, రాయదుర్గం మండలం రాయంపల్లికి చెందిన లలిత అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 179 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

అనాథ మహిళలకు అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆనలుగురు సేవాసమితి సభ్యులు గురువారం ఇద్దరు అనాథ మహిళల మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ పట్టణంలోని మిషనరీస్ ఆఫ్ చారిటీలో ఉన్న సుందరి(44) అనే మహిళ అనారోగ్యంతో బుధవారం మృతిచెందిందన్నారు. అలాగే గురువారం ఉదయం రామాంజినమ్మ(73) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. ఆ ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించాలని తమకు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి స్థానిక శ్మశన వాటికలో ఇదరి మహిళల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. సభ్యులు ప్రదీప్ ఆచారి, ఆటోవేణు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన కమలమ్మ అనే మహిళ గుండెపోటుతో మృతి చెందగా ఆమె కుటుంబానికి గ్రామస్థులు ఆర్థిక సాయం అందజేశారు. కమలేనాయక్ భార్య కమలమ్మ బుధవారం సాయంత్రం మృతి చెం దింది. వారి కుటుంబ పరిస్థితి బాగలేకపోవడంతో అంత్యక్రియలకు గ్రామానికి చెందిన ఉద్యోగులు, గ్రామ పెద్దలు కలిసి రూ. 22,500లు అందజేశారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

విడపనకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొనేకల్లు గ్రామానికి చెందిన ఓ బాలిక చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆ బాలిక గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అయితే నాలుగు రోజుల క్రితం కడుపు నొప్పిని తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లి దండ్రులు వెంటనే బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

రాగివైరు చోరీ

తాడిపత్రి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలదిన్నె గ్రామసమీపంలోని రైతు సత్యనారాయణ పొలంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగివైరును చోరీ చేశారు. గురువారం ఉదయం ఆ రైతు పొలానికి వెళ్లి చూడగా.. విషయం తెలిసింది. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


అనంతమ్మ మృతదేహం

బ్రహ్మసముద్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీటకల్లు గ్రామంలో అనంతమ్మ (58) అనే మహిళ విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. అనంతమ్మ మధ్యాహ్న సమయంలో ఇంటిలో బోరు మోటార్ వేసేందుకు కరెంట్ ప్లగ్‌ను స్విచ్‌బోర్డులో పెడుతుండగా ప్రమాదవశాత్తూ షాక్‌కు గురైంది. చేతిలో కరెంటు వైర్ పట్టుకోవడంతో షాక్ తగిలి కిందపడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించినవైద్యుడు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేంద్ర కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు: డీసీఓ

యాడికి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సిబ్బంది పన్నుల వసూళ్లలో నిర్ణీత సమయంలో నిర్దేశత లక్ష్యాలను సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తెలిపారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన బిల్ కలెక్టర్‌లతో మాట్లాడారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డంపింగ్‌యార్డును పరిశీలించి..నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, ఏఓ నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిస్ట్రిబ్యూటరీ చైర్మన్

తాడిపత్రి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘం టీబీటీ డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ కోమటికుంట్ల ప్రమీలమ్మ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని పట్టణంలోని వారి స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వారిని అభినందించారు. ఈ ఎన్నిక కు ఎమ్మెల్యే, చైర్మన్‌లు సహకరించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

48 గంటల్లోపే రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము

- వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ


కణేకల్లులో రైతులతో మాట్లాడుతున్న జేడీఏ

కణేకల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) రైతులు ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి వేలిముద్ర వేసిన 48 గంటల్లోపే ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ భారతి సొసైటీలో గురువారం ఆమె రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రభుత్వం 74 మంది రైతులతో 8505 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.1.97కోట్ల సొమ్ముకుగాను రూ.1.70 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. ఇక్కడి ధాన్యాన్ని తిరుపతి, శ్రీకాళహస్తికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఓ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట సొసైటీలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జేడీఏ ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే ఉద్దేహాళ్‌లో 3850 క్వింటాళ్లు, శ్రీధరఘట్టలో 4590 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏఓ సాయికుమార్ పాల్గొన్నారు.

మా భూములు తిరిగి ఇచ్చేయండి

- ఓబుళాపురం గ్రామరైతుల అర్జీ

డీ.హీరేహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు తమ గ్రామంలో కర్మాగారాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని చెప్పి అతి తక్కువ ధరలకే మా వద్ద నుంచి 400 ఎకరాల భూములు బలవంతంగా కొనుగోలు చేశారని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, ఉపాధి లభిస్తుందని ఏళ్ల తరబడి వేచి చూశామని, ఇక లాభం లేదని, మా భూములను మాకే ఇచ్చేయాలని ఓబుళాపురం గ్రామస్థులు తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను కోరారు. ఓబుళాపురంలో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో రైతులు మాట్లాడుతూ తమ గ్రామంలో దళిత, వెనుకబడిన కుటుంబాలకు 1980లో ప్రభుత్వం అసైన్డ్ భూములను మంజూరు చేసిందని, అయితే ఆ భూములను మైనింగ్ కార్యకలాపాల నిమిత్తం ఓఎంసీ , బీఐఓపీ కంపెనీ వారు 2005లో తమ నుంచి అతి తక్కువ ధరకే తీసుకున్నారని, మా భూములు సేకరించి దాదాపు 20 సంవత్సరాలు కావస్తున్నా ఇక్కడ ఎలాంటి పరిశ్రమ లు ఏర్పాటు చేయలేదని వాపోయారు. ఏర్పాటు చేసే పరిస్థితి కూడా లేదన్నారు. భూములు కోల్పోయిన తాము బతుకు తెరువు లేక పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి వలసవెళుతున్నామన్నారు. కనుక ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా సేకరించిన 365 ఎకరాల అసైన్డ్ భూములను, రెండు ఎకరాల పట్టా భూములను తిరిగి తమకే ఇవ్వాలని ఆయా రైతులు కోరారు. వీరికి మాజీ సర్పంచ్ సత్యప్ప గారి వెంకటేశులు, టీడీపీ నాయకులు బించె బసప్ప, బసవరాజు, నాగేంద్ర, హాలగప్ప మద్దతు పలికారు. ఎంపీడీఓ దాస్‌నాయక్, సర్వేయర్ రవితేజ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

గుత్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. గుత్తి ఆర్ఎస్‌లోని మొయిన్ బజారు లో గురువారం సాయంత్రం ఆయన డ్రగ్స్‌వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.